సాక్షి ఒడిశా

బుధవారం । 18 । డిసెంబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 6,07,856

వెండి : 88 గ్రాముల 100 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



సన్నాహాలు ఆరంభం

రథయాత్ర సన్నాహాలు ప్రారంభమయ్యాయి. కలప కోసం బయల్దేరారు.

- 8లో

గజపతిలో చిరుజల్లులు

పర్లాకిమిడి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గజపతి జిల్లాలో మంగళవారం అక్కడక్కడ చిరు జల్లులు పడ్డాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుబయట ఆరబెడుతున్న ధాన్యం తడిచిపోతాయని దిగులు పడుతున్నారు. కాగా ఆకాశం మేఘావృతం కావడంతో చలి తీవ్రత తగ్గినది. ఈ నెల 20వ తేదీ నుంచి చలితీవ్రత పెరుగుతోందని ఐఎండీ మాజీ డైరెక్టర్ డాక్టర్ శరత్ చంద్ర సాహు తెలిపారు.

న్యూస్‌రీల్

మూడు ధాన్యం కొనుగోలు మండీలు ప్రారంభం



కుంద్రలో ధాన్యం మండీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రూపు భొత్ర

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితి పరిధిలో మూడు ధాన్యం కొనుగోలు మండీలను కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపు భొత్ర మంగళవారం ప్రారంభించారు. కుంద్రా, డొంగరపంశి గ్రామాల్లో కొనుగోలు మండీలను అధికారులు ఏర్పాటు చేశారు. అయితే మండీల వద్ద కనీస సౌకర్యాలు లేక పోవడంతోపాటు ధాన్యం నాణ్యతను పరిశీలించే యంత్రం పనితీరుపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రారంభ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షులు రాధాబినోద్ సామంతరాయ్, బీడీవో కపిలేశ్వర తండి, కుంద్ర సమితి అధ్యక్షులు రాజేశ్వరి పొరజ, బినాయక ఆచార్య, బిప్రనారాయణ ఆచార్య, సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ మురళీధర హెస పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మిశ్రా

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మానసిక రోగులకు ఉచిత వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. బరంపురం ఎంకేసీజీ కళాశాలకు చెందిన మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ స్వాతి మిశ్రో, రాయగడకు చెందిన మానసిక సామాజిక సేవా కర్త పూర్ణ చంద్ర కదంబాల్ తదితరులు ఈ శిబిరంలో 47 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. వారికి అవసరమైన మందులను వైద్యులు పంపిణీ చేశారు. శిబిరానికి సమితిలోని 14 పంచాయతీలకు చెందిన ప్రజలు హాజరయ్యారు.

విజిలెన్స్ వలలో విద్యా శాఖ ఉద్యోగి



విజిలెన్స్ అధికారులు పట్టుకున్న రంజిత్ కుమార్ షడంగి

కొరాపుట్: విజిలెన్స్ వలలో విద్యా శాఖ ఉద్యోగి చిక్కారు. మంగళవారం నబరంగ్‌పూర్ జిల్లా పపడా హండి సమితి కేంద్రంలో సమితి విద్యా శాఖ అభివృద్ధి అధికారి (బీఈఓ) కార్యాలయంలో సెక్షన్ అధికారిగా పని చేస్తున్న రంజిత్ కుమార్ షడంగిని అధికారులు పట్టుకున్నారు. 2011లో పదవీ విరమణ పొందిన రామ చంద్ర సాహు అనే ప్రధానోపాధ్యాయుడిని పెన్షన్ పత్రాలు అనుమతి కోసం రు.10 వేలు లంచం డిమాండ్ చేశాడు. విసిగిన ఆ ప్రధానోపాధ్యాయుడు విజిలెన్స్ వారిని సంప్రదించగా వారిచ్చిన నగదుని రంజిత్‌కి హెచ్‌ఎం అందజేశారు. వెంటనే విజిలెన్స్ అధికారులు మెరుపు దాడి చేసి రంజిత్‌ని పట్టుకుని అరెస్టు చేశారు. రంజిత్ నివాసంలోనూ తనిఖీలు చేస్తున్నారు.

గంజాయిపై ఉక్కుపాదం



గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని గుడారి సమితి గంజుగుడ అటవీ ప్రాంతంలో గంజాయి సాగుపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో సాగవుతున్న గంజాయిని ధ్వంసం చేశారు. డ్రోన్ల సాయంతో గంజాయి సాగు ప్రాంతాలను గుర్తిస్తూ దాడులు చేపడుతున్నారు. గంజాయి సాగు, అక్రమ రవాణాపై చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

టీ కొట్టులోకి ట్రాక్టర్



టీ కొట్టులోకి దూసుకుపోయిన ట్రాక్టరు

భువనేశ్వర్: కటక్ నగరం షెల్టరు ఛక్ ప్రాంతం టీ కొట్టులోకి ఓ ట్రాక్టరు దూసుకు పోయింది. అదృష్టవశాత్తు టీ కొట్టు యజమాని ప్రాణాలతో బయటపడ్డాడు. ట్రాక్టరు హెల్పర్ నడపడంతో అదుపు తప్పి టీ కొట్టులోకి దూసుకు పోయినట్లు గుర్తించారు.

ముగిసిన పరబ్ సంబరాలు



జెడ్పీ అధ్యక్షురాలు సస్మితా మెలకని సత్కరిస్తున్న కలెక్టర్ వి.కీర్తి వాసన్



అలరిస్తున్న ప్రదర్శన



నిరంజన్ మిశ్రాకి అవార్డు అందిస్తున్న మంత్రి సురేష్ పూజారి

రాష్ట్రస్థాయి గిరిజన సాంస్కృతిక సంబరం కొరాపుట్ పరబ్–2024 ముగిసింది. రాష్ట్ర రెవెన్యూ మంత్రి సురేష్ పుజారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కొరాపుట్ జిల్లా కేంద్రాస్పత్రిలో సుమారు 15 ఏళ్లకి పైగా రోగులకు సేవలు అందించిన సర్జరీ నిపుణుడు నిరంజన్ మిశ్రాని పరబ్ పురస్కారంతో సత్కరించారు. అనేక రాష్ట్రాల కళాకారులు అద్భుతమైన ప్రదర్శనలతో అలరించారు. జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలకని కలెక్టర్ వి.కీర్తి వాసన్ పరబ్ మెమొంటోతో సత్కరించారు. – కొరాపుట్



పరబ్‌లో సాంస్కృతిక ప్రదర్శన



పరబ్‌కి హాజరైన వేలాది మంది ప్రేక్షకులు



పరబ్ ఏరియల్ వ్యూ

జయపురం సమితిలో బీజేడీకి షాక్!


- బీజేపీలో చేరిన సమితి అధ్యక్షురాలు, పలువురు సర్పంచ్‌లు



బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మన్‌మోహణ సామల్ సమక్షంలో బీజేపీలో చేరిన సమితి అధ్యక్షురాలు, ప్రజాప్రతినిధులు

జయపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి జయపురం వచ్చి వెళ్లిన తరువాత జయపురం బీజేడీ పార్టీలో ప్రకంపనలు చోటుచేసుకుంటున్నాయి. జయపురం సమితి బీజేడీ చేతి నుంచి బీజేపీ ఆధీనంలోకి వెళ్లే పరిస్థితి నెలకుంది. బీజేడీ పార్టీ నాయకురాలు.. జయపురం సమితి అధ్యక్షురాలు తిలోత్తమ ముదులి తన మద్దతుదారులైన పలువురు సర్పంచ్‌లు, సమితి సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ సమితి సభ్యులతో బీజేపీ గూటికి చేరారు. బీజేపీ యువ నేత రవీంద్ర మహాపాత్రో నేతృత్వంలో తిలోత్తమ ముదులితో పాటు 20 మందికిపైగా ఆమె అనుచరులు సోమవారం భువనేశ్వర్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మన్‌మోహణ సామల్ సమక్షంలో కాషాయి కండువాలు కప్పుకున్నారు. కొద్ది రోజుల కిందట జిల్లా పగ్గాలు మాజీ మంత్రి రబి నారాయణకు బీజేపీ పార్టీ అధినేత నవీన్ పట్నాయక్ అప్పగించిన తరువాత చోటు చేసుకున్న ఈ సంఘటన రబి నందోను ఖంగు తినిపించింది. గత 24 ఏళ్ల నుంచి తన వెంట నడిచే.. బీజేడీలో ఉంటున్న సర్పంచ్‌లు, సమితి సభ్యులు అకస్మాత్తుగా పార్టీ మార్చటంతో ఆయన కుంగిపోవటమే కాకుండా బీజేడీ శ్రేణులను ఆశ్చర్యపరచింది. ఈ సంఘటన పార్టీకి తీరని నష్టం కాగా మాజీ మంత్రి రబినందో రాజకీయ భవితపై తీవ్ర ప్రభావం చూపుతోందని రాజకీయ పరిశీలకుల విశ్లేషణ. బీజేపీ తీర్థం పుచ్చుకున్న వారిలో ఉమ్మరి పంచాయతీ సర్పంచ్ పబిత నాయిక్, రొండాపల్లి సర్పంచ్ ఆనంద హల్వ, కుములిపుట్ సర్పంచ్ సునీల పెంటియ, జయంతిగిరి సర్పంచ్ భొత్ర పూజారి, బరిణిపుట్ సర్పంచ్ పద్మ నందబలియ, ఆమె భర్త కమల నందబలితో పాటు ఎస్‌డీసీ సభ్యులు టంకుదొర హల్వ, సమితి అధ్యక్షురాలు భర్త నాగరావు, రబినందో నమ్మిన పలువురు స్థానిక నాయకులు ఉన్నారు. ఈ పరిణామం జయపురం బీజేడీ పార్టీకి కోలుకోలేని దెబ్బ అని పరిశీలకులు అభిప్రాయ పడుతున్నారు.

నేటి నుంచి గజపతి ఉత్సవాలు



పర్లాకిమిడి స్టేడియం వద్ద గజపతి ఉత్సవాల ప్రారంభ వేదిక



పల్లెశ్రీ మేళా ఎగ్జిబిషన్ ఏర్పాట్లు



సాంస్కృతిక వేదిక

పర్లాకిమిడి: స్థానిక గజపతి స్టేడియంలో బుధవారం సాయంత్రం 6 గంటలకు గజపతి ఉత్సవాలు, పల్లెశ్రీ మేళా ప్రారంభమవ్వనున్నాయి. ఉత్సవాల తొలిరోజు రాష్ట్ర వాణిజ్య, రవాణా, ఖనిజ శాఖ మంత్రి బిభూతి భూషణ్ జెన్నా ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. జిల్లాలో మోహనా నియోజకవర్గం ఎమ్మెల్యే దాశరథి గొమాంగో, పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, జిల్లా పరిషత్ చైర్మన్ తిరుపతిరావు తదితరులు గౌరవ అతిథులుగా పాల్గొనున్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో అనేక ప్రభుత్వ శాఖల స్టాల్స్‌తో పాటు, పల్లెశ్రీ మేళాలో వివిధ జిల్లాల నుంచి స్వయం సహాయక గ్రూపులు, మిషన్ శక్తి, చేతివృత్తుల కళాకృతుల వస్తువులు ప్రదర్శనలో ఉంచుతారు. ఛత్తీస్‌ఘడ్, అస్సాం, పశ్చిమబెంగాల్ నుంచి తమ కళా ప్రదర్శన ఇవ్వనున్నారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న డైరెక్టర్ (అడ్మిన్) దుర్గాప్రసాద్ పాఢి

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురంలో ఉన్న సెంచూరియన్ వర్సిటీ ఓపెన్ ఆడిటోరియంలో రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ బిజయ కుమార్ దాస్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానానికి మించిన దానం మరొకటి లేదన్నారు. అత్యవసర సమయాల్లో మరొకరికి ప్రాణంపోసే అవకాశం వస్తుందని పేర్కొన్నారు. శిబిరంలో మొత్తం 65 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏడీఎం రాజేంద్ర మింజ్, డిప్యూటీ కలెక్టర్, రెడ్ క్రాస్ కార్యదర్శి కమలకాంత పండా, సెంచూరియన్ ఉపకులపతి డా.సుప్రియా పట్నాయక్, రిజిస్ట్రార్ డా.అనితాపాత్రో, డైరెక్టర్ (అడ్మిన్) డా.దుర్గాప్రసాద్ పాఢి, డీన్ ఎస్.పి.పండా, డీన్ అడ్మిన్ డా.ఎస్.ఎన్.పండా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డా.నిహాల్, స్టూడెంట్ సంక్షేమ శాఖ డీన్ డా.రితీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ బిజయకుమార్ దాస్ తదితరులు

ఎయిమ్స్‌లో రోగి అనుమానాస్పద మృతి

భువనేశ్వర్: చికిత్స కోసం స్థానిక ఎయిమ్స్‌లో చేరిన రోగి అనుమానాస్పదంగా మృతి చెందాడు. పడకపై ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతూ ఉండటాన్ని సిబ్బంది మంగళవారం ఉదయం గుర్తించారు. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి తరువాత చోటు చేసుకుని ఉంటుందని భావిస్తున్నారు. పంచనామా పూర్తయితే మరణం పూర్వాపరాలు స్పష్టం అవుతాయని ఎయిమ్స్ అధికార వర్గాల సమాచారం. పోలీసులు మృత దేహం స్వాధీన పరచుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు జాజ్‌పూర్ జిల్లా అటలాపూర్ గ్రామానికి చెందిన దిలీప్ కుమార్ సాహు (70)గా గుర్తించారు. చికిత్స కోసం ఎయిమ్స్ ఆర్థోపెడిక్ వార్డులో చేరిన ఆయన మృతి చెందడం చర్చనీయాంశమైంది. దీనిపై పలు సందేహాలు తలెత్తుతున్నాయి. సోమవారం రాత్రి డ్యూటీలో పది మంది సిబ్బందితోపాటు వార్డులో 30 మంది రోగులు ఉన్నారు. మరో వైపు మృతిని కుమార్తె తోడుగా ఉండగా ఈ అఘాయిత్యం ఎలా సాధ్యమైందనే కోణంలో పోలీసుల విచారణ చేస్తున్నారు.

భయపెడుతున్న తేనెపట్లు!

- తొలగించాలని స్థానికుల విజ్ఞప్తి



సబ్‌కలెక్టర్ కార్యాలయ సమీప భవనానికి ఉన్న తేనెపట్లు

జయపురం: జయపురం సబ్‌కలెక్టర్ కార్యాలయ సమీపంలోని పాయిక సాహిలో ఉన్న తేనెటీగల పట్లు స్థానికులను భయపెడుతున్నాయి. వీటిని వెంటనే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. జయనగర్ పాయిక సాహి సమీపంలో ఈ తేనె పట్లు ఉన్నాయి. వాటి వలన ఆ సాహివారు ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మంగళవారం స్థానిక ప్రజలు జయపురం సబ్‌కలెక్టర్ ఎ.శౌర్యారెడ్డి ని కలిసి తేనెపట్లను తొలగించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ప్రాంతంలో చాలా కుటుంబాలు నివసిస్తున్నాయని సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రెండు రోజుల క్రితం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న డొంబురు పొరజ బ్యాంక్‌కు వెళ్తున్న సమయంలో తేనెటీగలు అతనిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్టు చెప్పారు. అలాగే కొద్ది రోజుల క్రితం ఆ ప్రాంతంలో నివసిస్తున్న ఏడుగురు వ్యక్తులపై దాడి చేసినట్టు పేర్కొన్నారు. ఈ పరిణామాలతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నామని చెప్పారు. తేనెటీగల వలన ప్రజలకు ఎటువంటి హాని కలుగక ముందే వాటిని తొలగించాలని.. ఆ వీధి పెద్దలు సంతును కుమార్ పాణిగ్రహి, అజయ ప్రధాన్, శ్యాము రజల్ సబ్‌కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

కూల్‌డ్రింక్ సీసాల్లో నాటు సారా రవాణా



సారాతో నింపిన కూల్ డ్రింక్ సీసాలు

భువనేశ్వర్: మద్యం అక్రమ రవాణాకు ఎన్నెన్నో అడ్డదారులు. ఖాళీ అయిన కూల్‌డ్రింక్ సీసాల్లో సారా పోసి రవాణా చేస్తున్నారు. ఈ వ్యవహారం పోలీసుల దృష్టికి రావడంతో గుట్టు రట్టు అయింది. ఆకస్మికంగా చేపట్టిన తనిఖీలో 180 లీటర్ల నాటు సారా నింపి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు ధ్రువీకరించారు. ఈ ఆరోపణ కింద 3 మంది నిందితుల్ని అరెస్టు చేశారు. ఈ వ్యవహారం మయూర్‌భంజ్ జిల్లాలో వెలుగు చూసింది. ఖుంటా బస్టాండు నుంచి బయల్దేరిన రాజా బాబు ప్రైవేటు ప్రయాణికుల బస్సులో కూల్ డ్రింక్ సీసాల్లో నాటు సారా నింపి అక్రమంగా రవాణా అవుతున్న సమాచారం అందడంతో పోలీసులు ఆకస్మిక తనిఖీ చేపట్టడంతో వ్యవహారం బట్టబయలైంది. భువనేశ్వర్ వెళ్తున్న బస్సు ఉదొలా బస్టాండులో ఆగిన సమయంలో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో సమగ్రంగా 180 లీటర్ల నాటు సారా జప్తు చేశారు.

ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముగ్గురిలో ఇద్దరు భువనేశ్వర్ హైటెక్ ప్రాంతంలో ఉంటున్న వ్యక్తులు సన్యాసి బిషాయి, ఉమాకాంత దాస్ కాగా మరో వ్యక్తి మయూర్‌భంజ్ జిల్లా అంబికాదెయిపూర్ గ్రామస్తుడు పుట్బూ సింగ్‌గా గుర్తించారు. మయూర్‌భంజ్ నుంచి కొనుగోలు చేసి భువనేశ్వర్ ప్రాంతంలో విక్రయించేందుకు కూల్ డ్రింక్ సీసాల్లో నాటు సారా నింపుకుని రవాణా చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. నాటు సారా తరలించేందుకు యజమాని రూ. 500 చెల్లిస్తున్నట్లు పోలీసులకు చిక్కిన నిందితులు ప్రకటించారు.

ఆస్పత్రికి తాళం



భువనేశ్వర్: ఆస్పత్రిలో చికిత్స చేయాల్సిన వైద్యుడు నిత్యం మద్యం మత్తులో తూగుతూ ఉండడంతో పూరీ జిల్లా కొణాసొ హరచండి ప్రసాద్ ఆరోగ్య కేంద్రానికి అక్కడి వారు తాళం వేశారు. తరచూ విధులకు కూడ డుమ్మా కొడుతున్నట్లు ఆరోపించారు. తక్షణమే ఈ డాక్టర్‌ను ఇక్కడ నుంచి తొలగించాలనే నినాదంతో గ్రామస్తులు ఆస్పత్రికి తాళం వేసి నిరసన ప్రదర్శించారు.

63 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం



ధాన్యం మండీల ప్రారంభోత్సవంలో కలెక్టర్ పట్వారి

రాయగడ: రైతుల నుంచి ధాన్యం క్రయవిక్రయాలకు సంబంధించి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. కలెక్టర్ ఫరూల్ పట్వారి ఈ మేరకు నియంత్రణ బజారు కమిటీ ప్రాంగణంలో మంగళవారం ధాన్యం మండీల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఆమె మండీలను ప్రారంభించారు. జిల్లాలోని ధాన్యం రైతులు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జిల్లా యంత్రాంగం తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ధాన్యం చివరి గింజ వరకు ప్రతి రైతు నుంచి ఖరీదు చేసేందుకు జిల్లాలో 43 మండీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె వెల్లడించారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన మండీల్లో విక్రయించాలని ఆమె సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి క్వింటాల్‌కు రూ.2300తో పాటు ఇన్‌పుట్ సాయం కింద మరో రూ.800 చెల్లిస్తుందన్నారు. ఈ ఏడాది 63 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేసేందుకు యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు.

క్లుప్తంగా

వచ్చే నెలలో ప్రధానమంత్రి రాష్ట్ర పర్యటన



భువనేశ్వర్: వచ్చే ఏడాది జనవరి నెలలో భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. ఒకే నెలలో రెండు పర్యాయాలు రాష్ట్ర పర్యటనకు విచ్చేయడం విశేషం. 202 జనవరి ఎనిమిది నుంచి పదో తేదీ వరకు నగరంలో కొనసాగే ప్రవాస భారతీయ దివస్ సమావేశానికి ప్రధానమంత్రి హాజరవుతారు. అలాగే జనవరి 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు జరగనున్న ఉత్కర్ష్ ఒడిశా కాంక్లేవ్ కార్యక్రమానికి ప్రధాని హాజరు కానున్నట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మంగళవారం వెల్లడించారు. ఈ ఏడాది జూన్ 12న బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ ఏడాది ఇప్పటికే మూడుసార్లు రాష్ట్రంలో పర్యటించారు.

భవానీ మాలధారుల గ్రామస్నానం



పూజా మండపం వద్ద గురుభవాని సంతోష్‌తో మాతా భవానీ లక్ష్మి

మల్కన్‌గిరి: స్థానిక మా నకిట్మి అమ్మవారి ఆలయం వద్ద భవానీ దీక్షధారులు మంగళవారం గ్రామ స్నానం నిర్వహించారు. గురు భవానీ పి.సంతోష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ నెల 22న ఇరుముడి కట్టుకుని భవానీలు విజయవాడ వెళ్లి దీక్ష పూర్తి చేస్తారు.

మత్స్య అవతారంలో ప్రసన్న వేంకటేశ్వరుడు



మత్స్య అవతారణంలో స్వామివారు

పర్లాకిమిడి: స్థానిక కేవుటి వీధిలోని శ్రీప్రసన్న వేంకటేశ్వర ఆలయంలో స్వామివార మత్స్య అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామి దివ్య కుణాకటా' వీక్షణాలు చూసి భక్తులు పులకించిపోయారు. ప్రధాన అర్చకులు ఎ.రాజగోపాలచారి ఉదయం తిరుప్పావై ప్రవచనాలు భక్తులకు వినిపించారు.

క్రిస్మస్ రోజు మద్యం విక్రయాలు వద్దు

జయపురం: క్రిస్మస్ పర్వదినాన పట్టణంలో మద్యం విక్రయాలు బంద్ చేయాలని మున్సిపాలిటీ 5వ నంబర్ వార్డు కౌన్సిలర్ ప్రణభ కిశోర్ నాయిక్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం కౌన్సిలర్ నాయిక్ కొంత మంది వార్డు యువకులతో జయపురం సబ్‌కలెక్టర్ అక్కవరం శౌశ్య రెడ్డికి కొరాపుట్ కలెక్టర్‌కు రాసిన మెమొరాండాన్ని సమర్పించారు. క్రిస్మస్ దినాన మద్యం దుకాణాలు మూయించాలని, కొత్త బస్టాండ్‌లో ఉద్యోగాలు స్థానికులకే కల్పించాలని కోరారు.

సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపివేత

భువనేశ్వర్: ధనుర్మాస పూజలు పురస్కరించుకుని పూరీ శ్రీ జగన్నాథ మందిరం కళకళలాడుతోంది. ఈ సందర్భంగా పాహలి భోగా (ప్రాతః భోగం) సేవ నిత్యం కొనసాగుతుంది. అనంతరం నిత్యం మధ్యాహ్నం పూట స్వామి విరామం పొందడం ఆచారం. అయితే ఈ ఏడాది శ్రీ మందిరం రత్న భాండాగారం మరమ్మతు, పునరుద్ధరణ పనులు చేపట్టడంతో నిత్యం స్వామికి పగటి పూట విరామం కల్పించడం సాధ్యం కాదని పరిగణించి పాహలి భోగ మాసంలో ఒక రోజు లాంఛనంగా ఈ సేవని కొనసాగించాలని ఛొత్తీషా నియోగుల ప్రత్యేక సమావేశంలో ముందస్తుగా నిర్ణయించారు. ఈ సందర్భంగా బుధవారం స్వామికి లాంఛనంగా మధ్యాహ్నం విరామం కల్పించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం సుమారు 2.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులకు దర్శనం తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్లు శ్రీ మందిరం అధికార వర్గాలు ప్రకటించాయి.

రథయాత్ర సన్నాహాలు ఆరంభం

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని రథయాత్ర కోసం సన్నాహాలు ఆరంభం అయ్యాయి. మంగళవారం శ్రీ మందిరం నుంచి ప్రత్యేక బృందం కలప గుర్తించేందుకు బయల్దేరింది. ఈ బృందం నయాగడ్ అటవీ ప్రాంతంలో వచ్చే ఏడాది యాత్ర కోసం రథాల తయారీకి తగిన కలప కలిగిన చెట్లని గుర్తిస్తుంది.

ఆజ్ఞా మాల స్వామి అనుగ్రహం

స్వామి కార్యంలో ఆజ్ఞా మాల ప్రధానం. ఆయన అంగీకారానికి ఈ మాల ప్రతీక. ఈ నేపథ్యంలో శ్రీ మందిరం రత్న వేదికపై కొలువు దీరిన శ్రీ జగన్నాథుని నుంచి ఆజ్ఞా మాల పొందిన తర్వాత 3 మందితో కూడిన త్రిసభ్య బృందం మంగళ వారం నయాగడ్‌కు బయల్దేరింది. ఈ బృదంలో సుదర్శన్ మేకప్, లక్ష్మణ్ మహాపాత్రొ, రబి బెహరా ఉన్నారు. వీరంతా శ్రీ మందిరం పాలన యంత్రాంగం ప్రతినిధులుగా పేర్కొన్నారు.

అడవి దేవతకు పూజార్చనలు

జగతి నాథుని యాత్ర కోసం కలప సేకరణ పురస్కరించుకుని అడవి దేవతకు పూజార్చనలు చేయడం ఆచారం. రథాల తయారీకి అనుకూలమైన చెట్లు గుర్తించి నరికే ముందు అడవి దేవత బొడొ రవులో పూజార్చనలు నిర్వహిస్తారు. కలప గుర్తింపు కోసం బయల్దేరిన శ్రీ మందిరం అధికార ప్రతినిధి బృందం ఈ పూజార్చనల్లో పాల్గొంటుంది. బుధ వారం ఉదయం 8 గంటల ప్రాంతంలో బొడొ రవులొ అమ్మవారి పూజార్చనలు చేపడతారు. ఈ పూజాదుల్లో శ్రీ మందిరం నుంచి తీసుకుని వెళ్లిన ప్రత్యేక నైవేద్యాల్ని అమ్మ వారికి నివేదిస్తారు.



కలప గుర్తించేందుకు బయల్దేరిన శ్రీ మందిరం ప్రతినిధి బృందం

ఏటా రథాల తయారీ కోసం నయాగడ్ అటవీ విభాగం 2 ట్రక్కులతో కలప దుంగల్ని సరఫరా చేస్తుంది. యాత్ర కోసం 3 రథాల తయారీకి సమగ్రంగా 865 కలప దుంగల అవసరం ఉంటుంది. గత ఏడాది సరఫరా అయిన కలప దుంగల్లో 51 మిగిలి ఉన్నాయి. తదనుగుణంగా మిగిలిన 814 కలప దుంగల్ని నయాగడ్ అటవీ విభాగం సరఫరా చేయాల్సి ఉంటుంది.

శ్రీ రామ నవమితో శ్రీకారం

అటవీ ప్రాంతంలో సేకరించిన కలప దుంగల్ని రథాల తయారీకి అనుకూలంగా చీల్చుతారు. ఈ పనుల్ని ఏటా పవిత్ర శ్రీ రామ నవమి తిథి నాడు లాంఛనంగా ప్రారంభిస్తారు. కార్యక్రమం తర్వాత శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణ ఏర్పాటు చేసే రథాల తయారీ శాల ప్రాంగణంలో కలప దుంగల కోతకు మార్గం సుగమం అవుతుంది. అక్షయ తృతీయ నుంచి రథాల తయారీ పూర్తి స్థాయి పనులు చేపడతారు.

రత్న భాండాగారం మరమ్మతు ప్రారంభం

భువనేశ్వర్: పూరీ జగన్నాథ ఆలయంలోని రత్న భాండాగారం మరమ్మతు, పునరుద్ధరణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. ద్వితీయ భోగ మండపం అనంతరం భారత పురావస్తు శాఖ (ఏఎస్‌ఐ) పనులు ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన నిర్ధారిత కార్యాచరణ (ఎస్‌ఓపీ) ప్రకారం పనులు జరుగుతున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

భక్తులకు మహా లఘు దర్శనం

మూడు నెలల్లో మరమ్మతు పనులు పూర్తవుతాయని భావిస్తున్నట్లు న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ తెలిపారు. మరమ్మతుల సమయంలో భక్తులు భిత్తొరొ కథొ నుంచి త్రిమూర్తుల లఘు దర్శనం పొందలేరు. బహరొ కథొ నుంచి దేవతల మహా లఘు దర్శనం పొందగలుగుతారు. ఆలయ ఆచార వ్యవహారాలు, నిత్య దైనందిన సేవాదులు, భక్తులకు దర్శనం ఏ విధంగానూ ప్రభావితం కాకుండా కార్యాచరణ జాగ్రత్తగా నిర్ధారించినట్లు మంత్రి తెలిపారు. ఈ నిర్ధారణ ప్రకారం మరమ్మతు పని ప్రతి రోజూ సుమారు ఐదు గంటల పాటు నిరవధికంగా కొనసాగుతుంది. నిత్యం మధ్యాహ్నం 12.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నారు.

తొలి రోజు పనులు

ఏఎస్‌ఐ ప్రత్యక్ష పర్యవేక్షణలో రత్న భాండాగారం పనులు ప్రారంభమయ్యాయి. తొలి రోజున మరమ్మతు పనుల్లో భద్రత కోసం రత్న భాండాగారం లోపల ఇనుప కంచె ఏర్పాటు చేశారు. 20 అడుగుల ఎత్తున ఈ కంచె ఏర్పాటైంది. దీని ఆధారంగా గోడలు, పైభాగాల్లో బీటలు వగైరా లోపాల్ని క్షుణ్ణంగా పరిశీలిస్తారు. అనంతరం బలహీనపడిన ఇనుప చువ్వల తొలగింపు, బీటలు పునరుద్ధరణ కోసం ప్లాస్టరింగు పనులు కొనసాగిస్తారు. పగిలిన రాళ్లు తారస పడితే తొలగించి కొత్త రాళ్లతో పునరుద్ధరిస్తారు. తొలుత సున్నం పూత తొలగించి గోడల పటుత్వం పరిశీలనపై దృష్టి సారిస్తారు. రత్న భాండాగారం లోపలి భాగం పనులు పూర్తి కావడంతో వెలుపలి భాగం పనులు చేపడతారు. తరచూ సాంకేతిక నిపుణుల కమిటీ ఈ పనుల్ని ప్రత్యక్షంగా పరిశీలిస్తుందని భారత పురావస్తు శాఖ ఏఎస్‌ఐ అధికార వర్గాలు తెలిపాయి.

నేడు పనులు నిలిపివేత

శ్రీ మందిరంలో ప్రత్యేక సేవాదుల నేపథ్యంలో రత్న భాండాగారం మరమ్మతు, నిర్వహణ రెండో రోజు పనల్ని నిలిపి వేస్తున్నట్లు ప్రకటించారు. గురువారం నుంచి యథాతథంగా ఈ పనులు కొనసాగుతాయని తెలిపారు.

ఆసక్తిగా క్రికెట్ పోటీలు



సెమీఫైనల్‌కు చేరిన గుణుపూర్, జయపురం జట్లు

జయపురం: స్థానిక విక్రమదేవ్ విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో జరుగుతున్న అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నమెంట్‌లో మూడో రోజు జరిగిన క్వార్టర్ ఫైనల్స్ పోటీల్లో గుణుపురం, విక్రమదేవ్ విశ్వవిద్యాలయం జట్లు గెలుపొందాయి. ముందుగా మల్కన్‌గిరి కాలేజీ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 16.3 ఓవర్లలో 107 పరుగులకు ఆలౌటైంది. గుణుపూర్ జట్టు 13 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. రెండో మ్యాచ్‌లో విక్రమదేవ్ విశ్వవిద్యాలయ టీమ్, రాయగడ కళాశాల టీమ్‌లు తలపడ్డాయి.

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాయగడ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 126 పరుగులు చేసింది. జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయ టీమ్ 14.1 ఓవర్లలో 4 కోల్పోయి టార్గెట్ ఛేదించింది.

చికిత్స పొందుతూ వివాహిత మృతి



భవాని(ఫైల్)

నరసన్నపేట: స్థానిక జోగిపేటకూడలికి చెందిన నారాయణశెట్టి భవాని (35) చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందింది. భర్త శ్రీధర్‌తో కలిసి ఆదివారం పోలాకి మండలం రాజారాంపురంలో వన భోజనానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగి స్తుండగా పోలాకి వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గాయపడిన భవానీని రిమ్స్‌లో చేర్పించగా పరిస్థితి విషమించడంతో మంగళవారం ఉదయం మృతి చెందింది. ఈమెకు ఇద్దరు పిల్లలు. పోలాకి పోలీసులు కేసు నమోదు చేశారు.

గాయపడిన వ్యక్తి మృతి



ఎర్రయ్య(ఫైల్)

ఆమదాలవలస: మండలంలోని ముద్దాడపేటకు చెందిన లాస ఎర్రయ్య(40) శనివారం మధ్యాహ్నం ఆమదాలవలస నుంచి తన ఇంటికి వెళుతుండగా తమ్మయ్యపేట సమీపంలో ట్రాక్టర్ ఢీకొనడంతో గాయపడ్డాడు. 108 అంబులెన్సులో రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు మంగళవారం తెలిపారు. మృతుడికి భార్య దుర్గ, కుమార్తె జస్మిత, కుమారుడు జ్ఞానేశ్వర్ ఉన్నారు.

19న ఫెన్సింగ్ క్రీడాకారుల నమోదు

శ్రీకాకుళం న్యూకాలనీ : రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు క్రీడాకారులు ఈ నెల 19న జరిగే ఆన్‌లైన్ ఎన్‌రోల్‌మెంట్‌లో భాగస్వామ్యం కావాలని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని రాజా మంగళవారం తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా జరిగే ఈ పోటీలకు ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుర్తింపు కార్డు కలిగిన క్రీడాకారులు ఉదయం 8 నుంచి 10 గంటల మధ్య హాజరుకావాలని కోరారు. వివరాలకు ఫెన్సింగ్ కోచ్ జోగిపాటి వంశీ (సెల్: 7660874844)ను సంప్రదించాలన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు పలాస విద్యార్థి



తిరుమల

కాశీబుగ్గ: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో ఈ నెల 21 నుంచి 24 వరకు జరగనున్న జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు పలాస హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న బడే తిరుమల ఎంపికయ్యాడని హెచ్‌ఎం దాశరథ తెలిపారు. ఈ సందర్భంగా తిరుమలను ఉపాధ్యాయులు పట్ట తవిటయ్య, శంకరరావు, శ్రీనివాసరావు, చిట్టిబాబు మంగళవారం అభినందించారు.

మేస్త్రి కుమారుడికి ఒకేసారి మూడు ఉద్యోగాలు

టెక్కలి: భవన నిర్మాణ మేస్త్రి కుమారుడు ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలిచాడు. టెక్కలి ఎన్‌టీఆర్ కాలనీకు చెందిన పైల రాము, ప్రమీళ దంపతుల పెద్ద కుమారుడు పైల గణేష్ సీఆర్‌పీఎఫ్, ఎస్ఎస్‌సీ జీడీ, ఇండియన్ నేవీ ఎస్ఎస్ఆర్ తదితర ఉద్యోగాలకు ఒకేసారి ఎంపికయ్యాడు. ఏడాది క్రితం సీఆర్‌పీఎఫ్ ట్రేడ్, ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎస్ఎస్‌సీ జీడీ, జూన్‌లో ఇండియన్ నేవీ ఎస్ఎస్ఆర్ తదితర ఉద్యోగాల ఎంపికలకు హాజరయ్యాడు. అన్ని పరీక్షలఫలితాలు ఒకేసారి విడుదల కావడం.. అన్నిట్లో గణేష్ ఉద్యోగాలు సాధించడంతో ఆ కుటుంబంలో ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. ఈ సందర్భంగా గణేష్ కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులు అభినందించారు.



గణేష్‌తో తల్లిదండ్రులు రాము, ప్రమీళ

సైనిక కుటుంబాలకు సాయం

పలాస: సోంపేట మండలం బారువ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ తెలుకల శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి సైనిక సంక్షేమ డైరెక్టర్, బ్రిగేడియర్ వెంకటరెడ్డి, శ్రీకాకుళం జిల్లా సైనిక సంక్షేమాధికారి శైలజ మంగళవారం సైనిక సంక్షేమ నిధి నుంచి లక్ష రూపాయలు చెక్ అందజేశారు. నందిగాం మండలం వల్లభరాయుడుపేటకు చెందిన ఆర్మీ జవాన్ సనపల జగదీశ్వరరావు మృతి చెందడంతో ఆయన కుటుంబానికి కూడా రూ.లక్ష చెక్ అందజేశారు. కార్యక్రమంలో పలాస-కాశీబుగ్గ మాజీ సైనిక సంక్షేమ సంఘ అధ్యక్షులు ఇళ్ల మన్మధరావు, ఉపాధ్యక్షులు బంగారు బారికి, కార్యదర్శి ఇప్పిలి తాతయ్య, దొంకాన వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న సైనిక సంక్షేమ అధికారి, ప్రతినిధులు

ఆపసోపాల నడుమ అర్ధ సంవత్సర పరీక్షలు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియెట్ విద్యార్థులకు అర్ధసంవత్సర పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. అన్ని యాజమాన్య జూనియర్ కాలేజీల్లో తొలిరోజు తెలుగు/సంస్కృతం/హిందీ పరీక్షలు రాశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకే ప్రశ్న పత్రంతో పరీక్షలు కొనసాగుతున్నప్పటికీ సకాలంలో విద్యార్థులకు పేపర్లు చేరవేయలేక ప్రిన్సిపాళ్లు ఆపసోపాలు పడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రభుత్వ కాలేజీల్లో ప్రశ్నపత్రాలు విద్యార్థులకు అందజేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఉపాధ్యాయినికి జెడ్పీ ఛైర్‌పర్సన్ పరామర్శ

కవిటి: పాఠశాలకు వెళ్లే దారిలో దుండగుడి దాడిలో తీవ్రంగా గాయపడిన ఉపాధ్యాయిని బల్లెడ భారతిని ఆర్.బైరిపురంలోని ఆమె నివాసంలో శ్రీకాకుళం జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ మంగళవారం పరామర్శించారు. దాడి జరిగిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు వజ్జ ప్రసాదరావు, పుల్లట జగదీష్, పిరియా ఆనందరావు, యలమంచి నీలయ్య, మాదిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కవిటి: బొర్ర పుట్టుగ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని బల్లెడ భారతిని ఆర్.బైరిపురంలోని ఆమె నివాసంలో డీఈఓ ఎస్ తిరుమల చైతన్య పరామర్శించారు. ఆయన వెంట ఎంఈఓ ధనంజయ మఝి, సిబ్బంది సంతోష్, మండల ఉపాధ్యాయులు బల్లెడ లక్ష్మణమూర్తి తదితరులు ఉన్నారు.



భారతిని పరామర్శిస్తున్న పిరియా విజయ

నౌపడ టీడీపీలో వర్గపోరు

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ తెలుగుదేశం పార్టీలో ఎంపీపీ భర్త కర్రి విష్ణుమూర్తి, టీడీపీ నాయకుడు సుగ్గు శాంతి స్వరూప్‌రెడ్డి వర్గాల మధ్య ఆధిపత్య పోరు నెలకొంది. విష్ణుమూర్తి వర్గానికి చెందిన అనపాన నగేష్ నౌపడ వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇంటి వద్ద మురుగుకాలువను కొందరు కప్పి వేయడంతో పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఇప్పటికి నాలుగు నెలలు కావస్తున్నా సొంత పార్టీ నాయకుల వల్లే సమస్య పరిష్కారం కావడం లేదంటూ మంగళవారం నౌపడ గ్రామ సచివాలయం వద్ద నిరసనకు దిగారు. కుటుంబంతో సహా పెట్రోల్ బాటిల్ పట్టుకొని బైఠాయించారు. అయినా సిబ్బంది పట్టించుకోకుండా సచివాలయానికి తాళాలు వేసి వెళ్లిపోవడంతో కొంతసేపటి తర్వాత నగేష్ కూడా వెనుతిరిగారు.



పెట్రోల్ బాటిల్ పట్టుకొని బైఠాయించిన టీడీపీ కార్యకర్త నగేష్, కుటుంబసభ్యులు

బూడిదే మిగిలింది!

- అంబటి ఎరుకువానిపేటలో వరి చేను దగ్ధం
- గత ఏడాది కూడా కాలిపోయిన కుప్పలు
- అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత రైతు

గార: ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట కాలిబూడిద కావడంతో బాధిత రైతు లబోదిబోమంటున్నాడు. గత ఏడాది కూడా ఇదే తరహాలో వరి పంట దగ్ధం కావడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. గార మండలం అంపోలు పంచాయతీ అంబటి ఎరుకువానిపేట సమీపంలో వరి చేను దగ్ధమైంది. గ్రామానికి అంబటి రామదాసు, వాణిలకు చెందిన పొలంలో అల్లుడు బాన్న రమణ వరి సాగు చేశాడు. సోమవారం సాయంత్రం చేను నూర్పు చేసేందుకు పొలం నుంచి తీసుకొచ్చి స్థానిక రియల్ ఎస్టేట్ స్థలంలో ఉంచి మంగళవారం ఉదయం నూర్పు చేసేందుకు సిద్ధమయ్యాడు. రాత్రి చాలా సమయం అక్కడే ఉన్న రైతు ఇంటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి మంటల్లో ఉన్న వరిచేను గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చాడు. శ్రీకాకుళం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో సుమారు రూ. 70 వేలు నష్టం వాటిల్లినట్టు బాధిత రైతు చెబుతున్నాడు. గతంలో కూడా పంటపొలంలోనే వరికుప్పలు కాలిపోవడం, ఈ ఏడాది కూడా నూర్పుకి సిద్ధమైన చేను కాలిపోవడంతో అనుమానం వచ్చి బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ రెల్ల జనార్దనరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కొత్తూరు: మండలంలోని బలద గ్రామానికి చెందిన బొడ్డేపల్లి రమేష్ జగన్నాథపేట సమీపంలో వరిపంట సాగు చేశాడు. కష్టపడి పండించిన 30 బస్తాల ధాన్యం మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైంది. విషయం తెలుసుకున్న వీఆర్వో రాజగోపాలరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు ధాన్యానికి నిప్పు పెట్టి ఉంటారని బాధిత రైతు అనుమానిస్తున్నారు.



కొత్తూరు: కాలిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వీఆర్వో

నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో బుధవారం నుంచి ఈ నెల 23 వరకు జరగనున్న శాఖాపరమైన(డిపార్ట్‌మెంటల్) పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు అధికారులను ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి చాంబర్లో పరీక్షల నిర్వహణపై మంగళవారం అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎచ్చెర్లలోని శ్రీశివాని ఇంజనీరింగ్ కళాశాల, శ్రీ వేంకటేశ్వర ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట)కళాశాలల వేదికగా పరీక్షలు జరుగుతాయని వివరించారు. గుర్తింపు కార్డులు తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రెటరీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ పరీక్షలకు 1831 మంది ఉద్యోగులు హాజరుకానున్నట్లు వివరించారు. సమావేశంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ వెంకటలక్ష్మి, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఎం.అమ్మాజీ, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ చక్రవర్తి, అదనపు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి శ్రీకాంత్, సీఐ దేవరకొండ ప్రసాద్, శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో అప్పారావు



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థుల ప్రతిజ్ఞ



ఈగల్ టాస్క్‌ఫోర్స్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, డీఐజీ, ఎస్పీ, పోలీసు అధికారులు

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- 'సంకల్పం' కార్యక్రమంలో డీఐజీ గోపీనాథ్ జెట్టి

ఎచ్చెర్ల క్యాంపస్: డ్రగ్స్ (మాదక ద్రవ్యాలు) రహిత సమాజం లక్ష్యంగా పోలీస్ శాఖ ముందుకు సాగుతుందని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి అన్నారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మంగళవారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సంకల్పంలో భాగంగా 'డ్రగ్స్ వద్దు బ్రో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబంలో ఒకరు డ్రగ్స్‌కు బానిసైనా కుటుంబం మొత్తంపై ప్రభావం చూపుతుందన్నారు. కళాశాలలు, విద్యా సంస్థలు యాండీ డ్రగ్స్ స్క్వాడ్‌లు నిర్వహించాలని, ఎటువంటి డ్రగ్స్ అమ్మకాలు ఉన్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కొని విలువైన జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలన్నారు. అనంతరం ఈగల్ టాస్క్‌ఫోర్స్, డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఫ్లాష్ మాబ్స్, స్కిట్లు అలరించాయి. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఆర్‌జీయూకేటీ ఎస్ఎంపురం క్యాంపస్ డైరెక్టర్ కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ, అదనపు ఎస్పీ కేవీ రమణ, శివానీ కళాశాల యాజమాన్య సభ్యులు దుర్గా శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్‌రాజు, సనపల శ్రీనివాసరావు, డీఎస్పీ వివేకానంద, సీఐలు అవతారం, ఇమ్మాన్యుయేల్‌రాజు, ఈశ్వరరావు, పైడపు నాయుడు, ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

లఘుచిత్ర పోటీల విజేతగా జి.సిగడాం మోడల్ స్కూల్



లఘుచిత్రంలో ఓ సన్నివేశం

జి.సిగడాం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) నిర్వహించిన లఘు చిత్రం పోటీల్లో జి.సిగడాం మోడల్ స్కూల్ విద్యార్థులు రూపొందించిన 'పవర్ ప్రేమికుడు' అనే షార్ట్ ఫిల్మ్‌కు ప్రథమ బహుమతి దక్కిందని ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లంక మంగళవారం తెలిపారు. విద్యుత్ ఎలా వాడాలి.. ఎలా పొదుపు చేయాలి అనే అంశంపై ఈ లఘుచిత్రాన్ని రూపొందించారు. ఈ నెల 20న విజయవాడలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందుకుంటారని పేర్కొన్నారు. 10వ తరగతి విద్యార్థులు వైకుంఠరావు, డోల వరప్రసాదరావు, ఈశ్వర్, తేజ నటించిన ఈ చిత్రం రూపొందించేందుకు తెలుగు అధ్యాపకులు కోట తిరుపతిరావు, షలీమ్ కృషి చేశారని తెలిపారు.

క్లుప్తంగా

పెదకుదమలోనే ఏనుగులు



పెదకుదమ పరిసర ప్రాంతాలలో ఉన్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని పెదకుదమ పరిసర ప్రాంతాలలో మంగళవారం ఏనుగులు దర్శనమిచ్చాయి.వరిధాన్యం కళ్లాల్లో ఉండడంతో రైతులు లబోదిబోమంటున్నారు.అరటిపంట కోతదశలో ఉందని, చెరకు, పామాయిల్ పంటలు ఉండడంతో పంటలను ధ్వంసం చేస్తాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు రోజుల నుంచి పెదకుదమ -చినకుదమ పరిసర ప్రాంతాలలో ఏనుగులు ఉంటూ రాత్రిపూట గ్రామంలోకి చొచ్చుకురావడంతో పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు.సంబంధిత అధికారులు వాటిని తరలించే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

తైక్వాండోలో నెల్లిమర్ల క్రీడాకారుడి ప్రతిభ



రోహిత్

నెల్లిమర్ల: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ -19 తైక్వాండో పోటీల్లో నెల్లిమర్లకు చెందిన కోల రోహిత్ కుమార్ గోల్డ్ మెడల్ సాధించాడు. తాజాగా కడప జిల్లా రైల్వే కోడూరులో జరిగిన పోటీల్లో 78 కిలోల విభాగంలో రోహిత్ ఈ ఘనత సాధించాడు. ఈ నెల 20 నుంచి మధ్యప్రదేశ్‌లోని భోపాల్ లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రోహిత్ పాల్గొంటాడని కోచ్ రవి తెలిపారు. డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు, పీడీ లక్ష్మణ్ ఆ విద్యార్థిని అభినందించారు.

సబ్‌జైలును తనిఖీ చేసిన జిల్లా న్యాయమూర్తి



ఎస్.కోట సబ్‌జైలును పరిశీలిస్తున్న జిల్లా న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి

శృంగవరపుకోట: పట్టణంలోని సబ్‌జైలును జిల్లా న్యాయమూర్తి బి.సాయి కల్యాణచక్రవర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి టీవీ రాజేష్‌కుమార్‌లు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా సిబ్బంది నిర్వహించే విధులు, ఖైదీలకు కల్పిస్తున్న సదుపాయాలు, పారిశుధ్యం వంటి అంశాలను పరిశీలించారు. ఉచిత న్యాయసేవా సహాయం గురించి ఆరా తీశారు. రిమాండ్‌ఖైదీలు, వారిపై ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యాయమూర్తి సాయికల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ ఆర్థిస్థోమత లేని ఖైదీలకు ప్రభుత్వం ఉచితంగా న్యాయసహాయం అందిస్తుందని, న్యాయవాదిని నియమిస్తుందని చెప్పారు. కావాల్సిన వారు జైలర్‌కు దరఖాస్తు చేసుకుంటే న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జైలు ఉద్యోగులు ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు



సంఘటనా స్థలంలో గాయాలపాలైన యువకులు

జియ్యమ్మవలస: మండలంలోని జోగిరాజుపేట సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం సాయంత్రం కురుపాం మండల కేంద్రం నుంచి కిచ్చాడ వెళ్తున్న నిమ్మక కైలాష్ (27), కిచ్చాడ నుంచి కన్నపుదొరవలసలోని తన ఇంటికి వస్తున్న బంగారి నాగార్జున (33) జోగిరాజుపేట వద్ద ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. వారిద్దరిని కురుపాం హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం ఏరియా హస్పిటల్‌కు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

19న సినీ నటుల ఎంపిక

రాజాం సిటీ: ఈ నెల 19న రాజాం మండల పరిధి కంచరాం తృప్తి రిసార్ట్‌లో నూతన సినీ నటుల ఎంపిక చేపట్టనున్నామని సినీ నిర్మాత శివప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు, మరాఠీ భాషల్లో ద్విభాషా చిత్రాన్ని నిర్మించనున్నామని, ఇందుకోసం అన్ని వయసుల నూతన నటీనటులను ఎంపిక చేయనున్నామన్నారు. ఈ నెల 22 నుంచి జనవరి 12 వరకు తృప్తి రిసార్ట్ పరిసర ప్రాంతాల్లో సినిమా చిత్రీకరించనున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 19న ఉదయం 9గంటలకు తృప్తిలో నిర్వహించనున్న ఆడిషన్స్‌లో పాల్గొనాలని కోరారు. ఆయనతోపాటు పీవీజీకే రాజు పాల్గొన్నారు.

ఎస్సీ ఉపకులాల స్థితిగతులపై ఆరా

- వివిధ శాఖల అధికారులతో కమిషన్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న రాజీవ్ రంజన్ మిశ్రా



వివరాలను అందిస్తున్న సీపీఓ బాలాజీ, జిల్లా అధికారులు

విజయనగరం అర్బన్: షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ సభ్యుడు రాజీవ్ రంజన్ మిశ్రా మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షెడ్యూల్డ్ కులాల వారీగా వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా స్థితి గతులపై ఆరా తీశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా ఆయా కులాలు పొందిన లబ్ధిని తెలుసుకున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఎస్సీల్లో ఉప కులాల వారీగా వెంటనే వివరాలను అందజేయాలని కోరారు. అలాగే పథకాలు, కార్యక్రమాల ద్వారా లబ్ధిపొందిన ఎస్సీల్లో ఉప కులాల వారీగా వివరాలను అడిగారు. ఇంకా పంచాయతీరాజ్, మున్సిపాలిటీ విద్యుత్, పోలీసు తదితర పెద్ద శాఖల్లో పనిచేస్తున్న ఎస్సీల వివరాలను తెలుసుకున్నారు. డ్వాక్రా సంఘాల సభ్యుల్లో ఎస్సీల వివరాలపై ఆరాతీశారు. వారికి ఏయే పథకాల ద్వారా లబ్ధి చేకూరిందో ప్రశ్నించారు. పార్వతీపురం మన్యం జిల్లా గురించి కూడా సమీక్షించారు.

ఉపకులాల సంఘాల నుంచి 101 వినతులు

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో వినతుల స్వీకరణ చేపట్టారు. ఎస్సీ వర్గంలో ఉన్న ఉపకులాలకు చెందిన 101 సంఘాల నుంచి వినతులు అందాయి. ప్రధానంగా కొన్ని వర్గాలు వర్గీకరణ వద్దని, మరికొన్ని సంఘాలు వర్గీకరణ అవసరమని వినతులు సమర్పించాయి. ఉపకులాల గణన జరపాలని, ఏ కులం వారు ఎంత మంది ఉన్నారు..వారి సామాజిక పరిస్థితులను అధ్యయనం చేయాలని, ఆ తర్వాతే వర్గీకరణ జరపాలని కోరారు. పైడి కులస్తులు 2002కు ముందు ఎస్టీలో ఉండేవారమని, ఓసీలో చేర్చడం వల్ల తమ అవకాశాలను కోల్పోయామని, తమను తిరగి ఎస్టీలో చేర్చాలలని వినతులు సమర్పించారు. ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను ప్రతి ఏడాది పొందడం కష్టంగా ఉందని ఐదేళ్లకు ఒకసారి తీసుకోడానికి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎస్.శ్రీనివాసమూర్తి, సోషల్ వెల్ఫేర్ డీడీ రామానందం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వివరాలు అందజేయాలి

ఈ సందర్భంగా రంజన్ మిశ్రా మాట్లాడుతూ ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా తమ కమిషన్ ఏర్పాటైందని చెప్పారు. ఇది చాలా కీలకమైన సమావేశమని కచ్చితమైన అంకెలతో సమగ్రంగా వివరాలను అందజేయాలని ఆదేశించారు. జిల్లా వారీగా సమావేశాలను నిర్వహించి, ఎస్సీ ఉపకులాల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై వివిధ వర్గాల అభిప్రాయాలను తెలుసుకున్నామన్నారు. ఎస్సీల్లో ఉన్న 58 ఉప కులాల స్థితిగతులను అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, సోషల్ వెల్ఫేర్ డీడీ బి.రామానందం, మన్యం డీడీ గయాజుద్దీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేసే వరకు పోరాటం

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు పిలుపు
- విద్యుత్ భవన్ వద్ద బిల్లుల కాల్చివేత



విద్యుత్ భవనం వద్ద బిల్లులు కాల్చివేస్తున్న సీపీఎం నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రభుత్వం పెంచిన విద్యుత్ భారానికి వ్యతిరేకంగా స్థానిక దాసన్నపేట విద్యుత్ భవన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేసి విద్యుత్ బిల్లులు కాల్చివేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ చంద్రబాబు నాడు ప్రపంచ బ్యాంకు జీతగాడుగా పాలించాడు, నేడు అదానికి అమ్ముడుపోయి అదానికి లాభాలు..ప్రజలపై భారాలా? అంటూ ప్రశ్నించారు. విద్యుత్తు ట్రూ అప్ ఛార్జీల పేరుతో రూ.16800 కోట్ల భారం ప్రజలపై వేశారు, ఇవి చాలవన్నట్లు అదానీ స్మార్ట్ మీటర్లు ఇంటింటికీ బిగిస్తున్నాడు. ప్రతి మీటర్‌కు రూ.7వేలు వినియోగదారుల నుంచి వసూలు చేస్తారు. కావున ట్రూ అప్ ఛార్జీలను ఉపసంహరించుకునే వరకు ఉద్యమిస్తామని ప్రజలంతా ఈ పోరాటంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పాలూరి రమణమ్మ, శ్రీనివాసరావు, జగదాంబ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలి

- యూటీఎఫ్ డిమాండ్



ఐటీడీఏ వద్ద నిరసన తెలియజేస్తున్న టీడబ్ల్యూ టీచర్లు

పార్వతీపురంటౌన్: టీడబ్ల్యూ టీచర్ల అక్రమ డిప్యుటేషన్లు రద్దుచేయకపోతే తల్లిదండ్రులు, విద్యార్థులతో కలసి ఐటీడీఏను ముట్టడిస్తామని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీ మోహన్‌రావు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడబ్ల్యూ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌టీ పోస్టులను డీఎస్సీలో చూపెడుతున్నట్లు వార్తలు వస్తున్నాయని, అలా అయితే వారి కుటుంబాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. పార్వతీపురం ఐటీడీఏలో పనిచేస్తున్న టీడబ్ల్యూ టీచర్లను సుమారు 400 కి.మీ దూర ప్రాంతాలకు డిప్యుటేషన్లు వేయడం అన్యాయమని, బెదిరించి రిలీవ్ చేస్తున్నారని, జిల్లాను దాటివేయడం అంటే మేము ఏది తలుచుకుంటే అది చేస్తామనే అహంకారం గిరిజన సంక్షేమ రాష్ట్ర అధికారులు చూపెడుతున్నారని మండిపడ్డారు. ఈ జిల్లాలో ఐటీడీఏ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను వేరే జిల్లాలకు తరలిస్తే ఇక్కడ ఎవరు చెబుతారని, గిరిజన విద్యార్థుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, కె.భాస్కరరావు మాట్లాడుతూ అధికారుల విధానాలు అశాంతికి గురిచేస్తున్నాయని, సీఆర్‌టీ పోస్టులను డీఎస్సీలో చూపెట్టడమంటే ఒకే ప్రాణం తీశా, మరో ప్రాణం పోశా అన్న సామెతలా ఉందన్నారు. ఐటీడీఏ కార్యాలయం లోపలకి వెళ్లకుండా పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.

గంజాయితో ఇద్దరు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎస్.శ్రీనివాస్ (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: గంజాయి అక్రమంగా కలిగి ఉన్న ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండుకిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎస్.శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. స్థానిక కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్ద ఇద్దరు అనుమానితులను వన్‌టౌన్ ఎస్సై మంగళవారం పట్టుకుని తనిఖీ చేయగా వారి వద్ద సుమారు రెండు కిలోల గంజాయి ప్యాకెట్లు లభించాయి. దీంతో వారిని విచారణ చేయగా ఉడాకాలనీకి చెందిన 24 ఏళ్ల సప్ప పవన్, వీటీ అగ్రహారానికి చెందిన యలగడ మురళిలుగా తెలిసింది. వారిద్దరూ పాతనేరస్తుల వద్ద గంజాయి కొనుగోలు చేసి చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో అమ్ముతుంటామని అంగీకరించారు. గూడ్స్‌షెడ్ వద్ద గంజాయి అమ్ముతున్నట్లు అందిన పక్కాసమాచారంతో వారిని పట్టుకుని కస్టడీలోకి తీసుకుని వీఆర్‌ఓల ఆధ్వర్యంలో తనిఖీ చేసి రెండు కిలోల గంజాయిని సీజ్ చేసి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డుమీద మరో రోడ్డు

- ప్రజాధనం నొక్కేసేందుకు ఇదో మార్గం



డొంగురువలసలో నిర్మాణం జరుగుతున్న కాలువల పక్కనే సిమెంట్‌రోడ్డు(ఫైల్)



మంగళవారం నిర్మించిన కొత్త రోడ్డు



కాలువలు, రోడ్డువేయడం లేదని చూపిస్తున్న కోమటిపల్లి వాసులు

బొబ్బిలిరూరల్: చిత్రంలోని ఈ దృశ్యాలు చూడండి.ఇందులో కాలువలు నిర్మిస్తున్నట్లు కనిపిస్తోంది. అక్కడే ఉన్న రోడ్డును గమనించండి. ఎంతో నాణ్యంగా కనీసం గుంత లేకుండా ఉన్న ఈ రోడ్డుపై మరో రోడ్డు వేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. బొబ్బిలి మండలంలోని డొంగురువలస గిరిజన గ్రామంలో దాదాపు రూ.10 లక్షల వ్యయంతో 60 మీటర్ల రోడ్డు, కాలవల నిర్మాణానికి పాలకులు, ప్రభుత్వం అధికారులు అనుమతిస్తూ నిధులను మంజూరు చేశారు. ఎంతోనాణ్యంగా ఉన్న రహదారిపై మరో రహదారిని నిర్మించేందుకు అధికారగణం ఆపసోపాలు పడుతూ యుద్ధప్రాతిపదికన పనుల ప్రారంభానికి సన్నాహాలు చేస్తోంది. ఇక్కడి చిత్రాన్ని పరిశీలించండి. ఇదే మండలంలోని కోమటిపల్లి గ్రామంలో 30 ఏళ్లుగా కనీసం రోడ్డు, కాలువలను నిర్మించేందుకు అధికారులు ప్ర యత్నించిన దాఖలాలు లేవని, ఎన్నోమార్లు అధికా రులకు విన్నవించినా పట్టించుకోలేదని అక్కడ నివా సముంటున్న వారు చేస్తున్న ఆరోపణ. కాగా అధికా ర పార్టీకి చెందిన ఓ కార్యకర్త డొంగురువలసలో ఈ రూ.10లక్షల విలువైన పనులకు కాంట్రాక్టర్ అవతారమెత్తి గుటకాయస్వాహా చేస్తుండగా, కోమటిపల్లిలో కనీస మౌలిక సదుపాయాలైన మురుగు కాలువలు, రహదారి నిర్మాణాలకు అధికారులు యత్నించక పోవడం గమనార్హం. ప్రజాధనాన్ని లూటీ చేసేందుకు ప్రజా అవసరాలు తీర్చనక్కర్లేదని, అవసరం లేకున్నా అవకాశాన్ని సృష్టించుకుని నిధులను మింగేయవచ్చని అర్థమవుతోందని ప్రజలు బహిరంగంగా తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

రోడ్డు ఎత్తుగా ఉండడంతో..



ఈ నిర్మాణాలపై మండల ఇంజినీరు రాజశేఖర్‌ను వివరణ కోరగా డొంగురువలసలో కాలవలు, రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేశామన్నారు. రోడ్డుపై రోడ్డు వేసేందుకు కారణాలున్నాయని, గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ఎత్తుగా ఉండడంతో సమాంతరంగా మరోడ్డును నిర్మించాల్సి వస్తోందదన్నారు. ఇదే విషయంపై అక్కడి టెక్నికల్ అసిస్టెంటు పూడి రామకృష్ణను వివరాలు అడగ్గా రోడ్డుమీద రోడ్డే వేస్తామని, ఆకాశంలో వేయమని వెటకారంగా సమాధానం ఇచ్చారు. – మండల ఇంజనీర్ రాజశేఖర్

ప్రభుత్వ పింఛనర్లకు సత్కారం

- ఘనంగా అఖిల భారత పింఛన్‌దారుల దినోత్సవం



వైద్య చికిత్సలో సంఘం సభ్యులు

విజయనగరం అర్బన్: అఖిల భారత పింఛన్ దారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘం జిల్లా కమిటీ స్థానిక పింఛనుదారుల భవనంలో 80 మంది సీనియర్ పింఛన్‌దారులను మంగళవారం ఘనంగా సత్కరించింది. తొలుత సంఘం భవన ఆవరణలో సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం సభ్యులకు పుష్పగిరి ఆస్పత్రి వైద్యులతో కంటి వైద్యపరీక్షలు, టీ డెంటల్ వైద్యులతో దంత వైద్య చికిత్సలను అందజేశారు. సంఘంలో 75 సంవత్సరాలు దాటిన సీనియర్ పింఛనర్లు 80 మందిని వారు ప్రభుత్వానికి అందించిన సర్వీసులను గౌరవిస్తూ దుశ్శాలువలతో సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పెద్దింటి అప్పారావు, జి.నారాయణల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా ఖజానా, అకౌంట్స్ ఆఫీసర్ ఆర్‌ఏఎస్‌కుమార్, ఉప ఖజానా అధికారులు ఐ.రమేష్, ఎం.ఆదినారాయణ, ఏపీఎన్‌జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీవీరమణ, జిల్లా అధ్యక్షుడు జీవీఆర్‌ఎస్ కిశోర్ హాజరయ్యారు.

నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

అనంతరం జరిగిన సంఘం జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పెద్దింటి అప్పారావు, ప్రధాన కార్యదర్శిగా గంగవరపు నారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వీఎస్‌ఆర్‌నాయుడు, కోశాధికారిగా ఎం.సూర్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్స్‌గా ఆరుగురిని, కార్యవర్గ సభ్యులుగా మరో ఆరుగురిని ఎన్నుకున్నారు.

అధికార లాంఛనాలతో ఆర్మీజవాన్ అంత్యక్రియలు



ఆర్మీజవాన్ మృతదేహం వద్ద సెల్యూట్ చేస్తున్న సీఐ శంకర్రావు, పోలీసులు, ఆర్మీ అధికారులు, సిబ్బంది

మెరకముడిదాం: మండలంలోని భీమవరం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బందపుఈశ్వరప్రసాద్ (33) సోమవారం సాయంత్రం గరివిడి మండలంలోని కాపుశంభాం జంక్షన్ సమీపంలో రోడ్డుప్రమాదంలో మృతిచెందిన విషయం విదితమే. ఈ మేరకు ఈశ్వరప్రసాద్ అంత్యక్రియలను మంగళవారం ఆయన స్వస్థలం భీమవరంలో చీపురుపల్లి సీఐ జి.శంకర్రావు, ఆర్మీ ఉద్యోగి సింగ్ ఆధ్వర్యంలో అధికార లాంఛనాలతో నిర్వహించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. జవాన్ ఈశ్వరప్రసాద్ భార్య వినూత్నకు తలకు, కాలికి గాయాల కావడంతో ఆమె ఇంకా ఆస్పత్రిలోనే చికిత్స పొందుతోంది. ఈశ్వరప్రసాద్ తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. వారి రెండవ కుమారుడైన ఈశ్వరప్రసాద్‌కు ఆర్మీలో జాబ్ రావడంతో కుటుంబానికి అండగా నిలిచాడు. ఇప్పుడు రోడ్డుప్రమాదం రూపంలో తమ కుమారుడిని మృత్యువు కబళించడంతో మృతుడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండడంతో గ్రామస్తులంతా కంటతడిపెట్టుకున్నారు. కార్యక్రమంలో బుదరాయవలస ఎస్సై జి.లోకేశ్వరరావు, ఆర్మీసిబ్బంది, బుదరాయవలస పోలీసులతో పాటు విజయనగరం రిజర్వ్ పోలీసులు పాల్గొన్నారు.

సంకల్ప గీతం పోస్టర్ ఆవిష్కరణ



సంకల్పం ప్రచార గీతాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: మాదక ద్రవ్యాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ చేపట్టిన సంకల్పాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రత్యేకంగా రూపొందించిన సంకల్పం గీతాన్ని, పోస్టర్లను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడుతూ, వ్యసనపరులుగా మారుతున్న యువతను మత్తు, మాదక ద్రవ్యాలకు దూరం చేయడానికి జిల్లా పోలీసు శాఖ తమవంతు కృషిచేస్తోందన్నారు. ఇందులో భాగంగా సంకల్పం కార్యక్రమాన్ని చేపట్టి, తరచూ సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది తమ పరిధిలోని కళాశాలలను సందర్శించి, యువతను మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చెడు స్నేహాల ప్రభావం, ఒత్తిడితో డ్రగ్స్ వినియోగానికి అలవాటుపడవద్దని సూచించారు. పట్టణానికి చెందిన కాకర్ల గాంధీ రచన, స్వరకల్పన చేసి, సంగీతాన్ని అందించి, ప్రత్యేకంగా రూపొందించిన సంకల్ప గీతాన్ని ఆవిష్కరించామన్నారు. అన్ని ప్రచార కార్యక్రమాల్లో ఈ గీతాన్ని వినియోగిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కాకర్ల గాంధీని ప్రత్యేకంగా అభినందించి, సత్కరించి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు.

రామతీర్థంలో వైభవంగా పునర్వసు పట్టాభిషేకం



శ్రీరామచంద్రమూర్తికి పట్టాభిషేక సర్గను విన్నవిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పునర్వసు పట్టాభిషేక మహోత్సవాన్ని ఆలయ అర్చకులు మంగళవారం అత్యంత వైభవంగా జరిపించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత శ్రీ గోదాదేవి పల్లకి సేవను జరిపించారు. అనంతరం యాగశాలలో సుందరకాండ హవనం చేపట్టి ఉత్సవమూర్తుల వద్ద నిత్య కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రం సందర్భంగా శ్రీమద్రామాయణ పారాయణాలు జరిపించి రామాయణంలో పట్టాభిషేక సర్గ విన్నవించారు. శ్రీరామచంద్రమూర్తికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, వివిధ రకాల ఫలరసాలతో అభిషేకాలు నిర్వహించి పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవోపేతంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, పవన్, రామగోపాల్ పాల్గొన్నారు.

సీహెచ్ అగ్రహారంలో చోరీ

- గంటల వ్యవధిలో కేసు ఛేదించిన పోలీసులు

పూసపాటిరేగ: మండలంలోని సీహెచ్ అగ్రహారంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సినిఫక్కీలో మంగళవారం ఉదయిం చోరీ జరిగింది. ఈ ఘటన వివరాల్లోకి వెళ్తే గ్రామానికి చెందిన మొల్లి సత్యం ఇంటిలో ఎవరు లేని సమయంలో దగ్గర బంధువే ఇంట్లో చొరబడి పెట్టిలో ఉన్న పావుతక్కువ మూడు తులాల బంగారం,10 తులాల వెండి, రూ.7200 చోరీ చేసింది. ఇంటికి వచ్చేటప్పటికి తలుపులు తీసి ఉండడంతో బాధితులు లబోదిబో అంటూ పూసపాటిరేగ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై ఐ.దుర్గాప్రసాద్ సిబ్బందితో పాటు రంగప్రవేశం చేసి విచారణ చేశారు. బయట నుండి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి చోరీ చేసినట్లు మొల్లి సత్యం సమీప బంధువు మొల్లి రామలక్ష్మి పోలీసులకు తెలియజేశారు. దీనిపై అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో రామలక్ష్మిని విచారణ చేయడంతో తానే దొంగతనం చేసినట్లు ఒప్పుకోగా పోలీసులు కేసు నమోదు చేసి నిందుతురాలిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

5న హైందవ శంఖారావం

భోగాపురం: విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావ కార్యక్రమంలో పాల్గొనాలని వీహెచ్‌పీ ప్రతినిధులు ఎమ్మెల్యే లోకం నాగమాధవిని కోరారు. ఈ మేరకు మంగళవారం ముంజేరులోని తన నివాసంలో ఆమెను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాల నిర్వహణలో చేయాల్సిన సంస్కరణల నిమిత్తం ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. హిందు దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తిని చేసి, స్వయం ప్రతిపత్తి కలిగిన ఒక ఉత్తమధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ వెంటనే చట్ట సవరణ చేయాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్ ఒక జాతీయోద్యమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే నాగమాధవి వీహెచ్‌పీ ప్రతినిధులతో కలిసి శంఖారావ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు శ్రీనివాస్, నాగరాజుశర్మ, బూర్ల శ్రీధర్, మురళీకృష్ణ, సీతారాములు, త్రినాధ్‌శ్రీకృష్ణ, బ్రహ్మజీ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పని చేయాలి



విజయనగరం రూరల్: శిక్షణను ఉద్దేశించి మాట్లాడుతున్న అధికారులు

విజయనగరం రూరల్: మండలంలోని ప్రతీ గ్రామంలోనూ పేదరికాన్ని పూర్తి స్థాయిలో నిర్మూలించే దిశగా ప్రతీ సచివాలయ కార్యదర్శి పని చేయాలని ఎంపీడీఓ తిరుపతినాయుడు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో రెండు రోజుల పాటు సుస్థిరాభివృద్ధి పలు లక్ష్యాలపై శిక్షణ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని జవాబుదారీతనం, బాలల వికాసం, సామాజిక వికాసంతో పాటు తాగునీరు, పారిశుధ్యంపై స్థానికులకు ఎప్పటికప్పుడు అవగాహన కలిగించాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. ప్రతీ ఒక్కరికి ఉపాధి హామీ వంద రోజులు పని కల్పించే దిశగా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో శిక్షణ బృందం రాజారావు, విజయ్ పాల్గొన్నారు.

సమాజంలో మార్పుతో అభివృద్ధి

డెంకాడ: సమాజంలో మార్పుతో అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతుందని శిక్షణ కార్యక్రమం పరిశీలకులు సుబ్బారావు అన్నారు. లోకలైజేషన్ ఆఫ్ సస్టైనబుల్ డవలప్‌మెంట్ జోల్ పేరుతో రెండు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. కార్యక్రమంలో పరిశీలకులు సుబ్బారావు మాట్లాడుతూ స్వయం సమృద్ధి దిశగా స్థానిక సంస్థలు పని చేయాలన్నారు. సమాజంలో స్త్రీలకు సమాన గౌరవం ఉండేలా సమాజాన్ని చైతన్య పరచాలన్నారు. బాల్య వివాహాలను పూర్తి నియంత్రించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ భవాని, ఈఓపీఆర్డీ శ్రీనివాస్, ఏపీఎం శ్రీనివాస్, పలువురు సర్పంచ్‌లు, పలు విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.